

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 17-04-2025 | సంపుటి - 22 | సంచిక - 353 | రూ : 4 | పేజీలు: 8


## అన్నదాతల కన్నీటి రాశులు

- అకాల వర్షాలకు తడిసిపోతున్న ధాన్యం
- కాపాడుకుందామన్నా పట్టాలు కరవు
- కొర్రీలు భరించలేక మిల్లర్లకు విక్రయం

**ఖమ్మం:** అన్నదాతల ఆరుగాలం కష్టం వర్షార్పణమవుతోంది. పది రోజులుగా ఈదురుగాలులతో రాష్ట్రంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు కంటిమీద కునుకు కరవైంది. కర్షకులు కల్లాలు.. రహదారులు.. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోస్తున్నారు. వీరికి పంపిణీ చేయాల్సిన పట్టాలు అరకొరగా ఉంటున్నాయి. పంట కోతల అనంతరం మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం నిల్వలను సకాలంలో కొనుగోలు చేయాల్సిన నిర్వాహకులు తేమ, తాలు పేరిట కాలయాపన చేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ,

తరువాయి 2లో





## చైనాపై 245 శాతానికి సుంకాలు

- అగ్రరాజ్యం ఉగ్రరూపం

వాషింగ్టన్: ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధం తారస్థాయికి చేరింది. చైనా ఎగుమతులపై ఏకంగా 245 శాతం సుంకాలను అమెరికా విధించింది. అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీ విమానాల ఆర్డర్లను తీసుకోవద్దని తమ కంపెనీలను చైనా ఆదేశించడంతోపాటు కీలకమైన ఖనిజాల ఎగుమతిని నిలిపేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. 'అత్యంత కీలకమైన, అరుదైన ఖనిజాల ఎగుమతిని చైనా నిలిపేయడంవల్ల జాతీయ భద్రతకు ఎదురయ్యే సవాళ్లపై పరిశోధన జరపడానికి ఉద్దేశించిన కార్యనిర్వాహక ఉత్తర్వుపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తొలి రోజు నుంచే 'అమెరికా ఫస్ట్ ట్రేడ్ పాలసీ'కి అనుగుణంగా 'మేక్ అమెరికా ఎకానమీ

తరువాయి 2లో

## రూ.27 వేల కోట్ల పెట్టుబడులు

### 5,600 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్లు

- రెండు సంస్థలతో రెడ్కో ఒప్పందం
- 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యం
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి

**హైదరాబాద్, రాజేంద్రనగర్ :** రాష్ట్రంలో 2035 నాటికి 40 వేల మెగావాట్ల హరిత ఇంధనం(గ్రీన్ పవర్) ఉత్పత్తి లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రణాళిక అమలులో భాగంగా జనవరిలో క్లీన్ అండ్ గ్రీన్ పవర్ పాలసీని అందుబాటులోకి తెచ్చామన్నారు. దాంతో ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. రాజేంద్రనగర్‌లోని

తరువాయి 2లో




## 21న ప్రధానితో వాన్స్ భేటీ

* కుటుంబ సమేతంగా భారత్‌కు రానున్న అమెరికా ఉపాధ్యక్షుడు

2లో





## అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం

- ఆ 400 ఎకరాలు ప్రభుత్వ బంజరు భూములు
- 2004లోనే నాటి ప్రభుత్వం అభివృద్ధి పనులకు కేటాయించింది
- సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సీఎస్ వెల్లడి

2లో

## కరెంటునూ దాచుకోవచ్చు.. వాడుకోవచ్చు!

- రాష్ట్రంలో 3 వేల మెగావాట్ల బ్యాటరీ స్టోరేజీ ప్రాజెక్టులు
- వెయ్యి మెగావాట్లకు టెండర్లు పిలిచిన విద్యుత్ సంస్థలు
- జెన్‌కో థర్మల్ బ్యాక్‌డౌన్ చేసినా.. 1,500 మెగావాట్ల మిగులు
- ఏడాదిలో మరో 10 వేల మెగావాట్ల సౌర విద్యుత్

2లో



## మీరు సాయం చేస్తే.. పుంజుకుంటాం

- వైకాపా హయాంలో ఆర్థిక విధ్వంసం
- ఆదాయం కంటే ఖర్చు ఎక్కువైంది
- అదనపు కేటాయింపులు ఇప్పించండి
- ఏపీ పునర్నిర్మాణానికి అండగా నిలవండి
- 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు వినతి
- సచివాలయంలో స్వయంగా ఎదురెళ్లి స్వాగతం
- రాజధాని సహా వివిధ అంశాలపై ప్రజంటేషన్

2లో





## ఆ 100 ఎకరాల్లో పూర్వస్థితిని పునరుద్ధరించండి

- సంబంధిత ప్రణాళికను నాలుగు వారాల్లో సమర్పించండి
- కంచ గచ్చిబౌలి భూములపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- మేం ఆ భూమి తాకట్టు, యాజమాన్య హక్కుల విషయాల జోలికెళ్లడం లేదు
- పర్యావరణ పరిరక్షణకు అవుట్ ఆఫ్ ద వే వెళ్తామన్న కోర్టు
- వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టీకరణ
- నిబంధనలు ఉల్లంఘిస్తే అధికారులు జైలుకు వెళ్లాల్సి వస్తుందని హెచ్చరిక
- తదుపరి విచారణను మే 15కు వాయిదా వేసిన సర్వోన్నత న్యాయస్థానం

2లో

## సరికొత్త సచివాలయం

- ఐకానిక్ టవర్ల నిర్మాణానికి టెండర్లు
- రూ.4,688 కోట్ల అంచనాతో బిడ్ల ఆహ్వానం
- వచ్చే నెల 1 వరకు గడువు

2లో



# ఆ 100 ఎకరాల్లో పూర్వస్థితిని పునరుద్ధరించండి

దిల్లీ: కంచ గచ్చిబౌలిలోని 100 ఎకరాలలో ధ్వంసం చేసిన పచ్చదనాన్ని పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. అందుకు సంబంధించిన ప్రణాళికను నాలుగు వారాల్లోపు సమర్పించాలని నిర్దేశించింది. చెట్లు కొట్టేయడంతో ఇబ్బందిపడుతున్న వన్యప్రాణుల సంరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలంది. ఆ భూమిని తాకట్టు పెట్టారా? లేదా? దీని యజమాని ఎవరన్న వివరాల జోలికి పోవడంలేదని, కేవలం పర్యావరణ పరిరక్షణ వరకే పరిమితం అవుతున్నట్లు పేర్కొంది. పర్యావరణ పరిరక్షణకు అవుట్ ఆఫ్ ద వే వెళ్తామని, ఆర్టికల్ 142 కింద ఏ ఆదేశాలైనా ఇచ్చే అధికారం సుప్రీంకోర్టుకు ఉందని గుర్తుచేసింది. కంచగచ్చిబౌలి భూముల్లో బుల్డోజర్లతో చెట్లను తొలగించడంతో అక్కడి వన్యప్రాణులు పడుతున్న ఇబ్బందుల గురించి ప్రసారమాధ్యమాల్లో విస్తృతంగా కథనాలు వెలువడటంతో విషయం జాతీయస్థాయిలో చర్చనీయాంశమైంది. పర్యావరణ అంశాల్లో సుప్రీంకోర్టుకు సహకారం అందిస్తున్న అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ ఆ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించి తక్షణం అక్కడ జరుగుతున్న పనులపై స్టే విధించడంతోపాటు అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, క్షేత్రస్థాయి పరిస్థితులపై నివేదిక సమర్పించాలని కేంద్ర సాధికార కమిటీ(సీఈసీ)ని ఆదేశించింది. దాంతో ఆయా వ్యవస్థలు తమ నివేదికలను దాఖలు చేయడంతో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఏజీ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్‌సింఘ్వీ, మేనకా గురుస్వామి, కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా, సీఈసీ తరఫున అమికస్‌క్యూరీ పరమేశ్వరన్, మరికొందరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రినాయుడు, ఎస్.నిరంజన్‌రెడ్డి, గోపాల్‌శంకర్‌నారాయణన్‌లు వాదనలు వినిపించారు. వాల్టా కింద స్వీయధ్రువీకరణ ద్వారా కొన్ని రకాల చెట్లను తొలగించేందుకు వెసులుబాటు ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం దాన్ని అనుసరించి ఈ ప్రాంతంలో చెట్లను కొట్టేసిందని తెలంగాణ తరఫున వాదించిన అభిషేక్‌సింఘ్వీ తొలుత ధర్మాసనం దృష్టికి తెచ్చారు. అయితే, ఆ చట్టంలోని సెక్షన్ 40 ప్రకారం కొన్నిప్రాంతాలకు మాత్రమే మినహాయింపు ఉందని, చెట్లకు ఎక్కడా మినహాయింపులేదని అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ గుర్తుచేశారు. పైగా రాష్ట్ర ప్రభుత్వం ఈ 400 ఎకరాల భూమిని రూ.10 వేల కోట్లకు తాకట్టు పెట్టిందని, ఆ తర్వాతే చెట్ల నరికివేత ప్రారంభమైందన్నారు. ఈ వాదనల నేపథ్యంలో జస్టిస్ గవాయ్ తీవ్రంగా స్పందించారు. ''చెట్లుకొట్టడానికి మీరు ఎవరైనా అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నారా అన్న ప్రశ్నకు అవునో కాదో సమాధానం చెప్పండి. 1996 డిసెంబరు 12న సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులకు అతీతంగా చెట్లు కొట్టేయడానికి అదనపు మినహాయింపులు ఉన్నాయా? ఆ మినహాయింపులు సుప్రీంకోర్టు ఉత్తర్వులకంటే గొప్పవా? నాటి ఉత్తర్వుల్లో సుప్రీంకోర్టు చెట్టు అన్న పదానికి విస్తృత అర్థాన్ని చెప్పింది. చిన్న పొదలను తొలగించే విషయంలో మహారాష్ట్ర ప్రభుత్వం రెండు దశాబ్దాలుగా పోరాడుతోంది. మహారాష్ట్రలోని జుడిపీ అడవులు వాస్తవంగా అడవులుకావని నాకు వ్యక్తిగతంగా తెలుసు. అక్కడ హైకోర్టు, సచివాలయం, న్యాయమూర్తుల భవనాలను నిర్మించినప్పటికీ దానిపై తలెత్తిన వివాదంపై మహారాష్ట్ర పోరాడుతోంది. ఇక్కడేమో 1996 ఉత్తర్వులను బైపాస్ చేసి స్వీయ ధ్రువీకరణతో చెట్లు కొట్టేయడం ఆశ్చర్యం కల్గిస్తోంది. మేం సీఈసీ నివేదికను ఇంకా చూడలేదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర కార్యదర్శులను తీవ్ర చర్యల నుంచి రక్షించుకోవాలనుకుంటే ప్రస్తుతం ధ్వంసం చేసిన ప్రాంతాన్ని ఎలా పునరుద్ధరిస్తారో చెబుతూ కార్యాచరణ ప్రణాళిక సమర్పించండి. పర్యావరణ పరిరక్షణ చాలా ముఖ్యం. ప్రస్తుత కేసులో చెట్ల కొట్టివేతతో ఆవాసం కోల్పోయి ఇబ్బందులు పడుతున్న జింకలపై వీధికుక్కలు దాడిచేసిన వీడియోలను చూసి ఆశ్చర్యపోయాం. అదృష్టవశాత్తు మా ఆదేశాలమేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఆగమేఘాల మీద సంఘటనా స్థలానికి వెళ్లి నివేదిక పంపారు. చెట్లను కొట్టేందుకు అనుసరిస్తున్న స్వీయధ్రువీకరణ విధానం... ఇరవై ఏళ్లుగా కొనసాగుతోందని మీరు (సింఘ్వీ) చెబుతున్నారు. అయితే అది ఏ ప్రభుత్వం చేసినా తప్పే. వాల్టాకు మంత్రులు, అధికారులు చెప్పిన అర్థం ఆధారంగా మేం వెళ్లం'' అని జస్టిస్ గవాయ్ తెలంగాణ న్యాయవాదిని ఉద్దేశించి పేర్కొన్నారు.

### సెలవు రోజుల్లో తొందరేమి?

ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం చెట్లుకొట్టేయడాన్ని సమర్థించుకోవడానికి బదులు ఆ ప్రాంత పునరుద్ధరణ కోసం ప్రణాళికతో ముందుకురావడం మంచిది. లేదంటే అక్కడ తాత్కాలికంగా నిర్మించే జైలుకు ఎంతమంది అధికారులు వెళ్తారో చెప్పడం కష్టం. సెలవురోజుల్లో చెట్లు కొట్టేయాల్సింత తొందర ఏమొచ్చింది? దీనివెనుక కసరత్తు ఏళ్లతరబడి జరిగి ఉండొచ్చు. కానీ బుల్డోజర్లను మాత్రం సెలవుదినాల్లోనే దింపారు. ప్రస్తుతం 100 ఎకరాలను పూర్వస్థితికి తీసుకొచ్చేలా పునరుద్ధరించండి. ఆశ్రయం కోల్పోయిన వన్యప్రాణుల సంరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలి. ఆ పనులను వన్యప్రాణ సంరక్షణాధికారి వ్యక్తిగతంగా పర్యవేక్షించేలా చూడాలి. లేదంటే అక్కడున్న చెరువు గట్లపై తాత్కాలిక జైళ్లు నిర్మిస్తే కొందరు అధికారులు సేదతీరడానికి వీలవుతుంది. రాష్ట్రంలో అటవీ ప్రాంతాల గుర్తింపునకు ఏర్పాటు చేసిన కమిటీలో విభిన్న కార్పొరేషన్ల అధికారులను ఎందుకు నియమించారో మాకు అర్థంకాలేదు. ఆ కమిటీని రాష్ట్ర ప్రభుత్వం మార్చకపోతే మేమే రద్దు చేస్తాం.

### * నగరాల్లో హరితవనాలు ఉండనివ్వండి..

మొత్తం 2,300 ఎకరాల్లో వివాదాస్పద భూమి 400 ఎకరాలని చెబుతున్నారు. మేం ఆ మొత్తం భూమిలో ఎక్కడా చెట్లుకొట్టొద్దని ఆదేశాలు ఇవ్వవచ్చేమో. నగరాల్లో హరితవనాలను ఉండనివ్వండి. ముంబయిలో సంజయ్‌గాంధీ నేషనల్ పార్క్, చెన్నైలో గిండీ నేషనల్‌పార్క్, జైపుర్‌లో అల్వార్ నేషనల్ పార్కులున్నాయి. 2017 నుంచి సుస్థిర అభివృద్ధి కోసం నేను ప్రచారం చేస్తున్నా. పర్యావరణంఅభివృద్ధి మధ్య సమతౌల్యం పాటించేలా 2017లో నాగ్‌పుర్ హైకోర్టు నుంచి తొలి తీర్పు ఇచ్చా. అభివృద్ధి చేయాలనుకుంటే నిర్దిష్ట విధానాన్ని అనుసరించాలి. ఇక్కడ ఇదివరకున్న పరిస్థితులను యథావిధిగా పునరుద్ధరించడం మా ప్రథమ ప్రాధాన్యం. ఆ తర్వాత పరిస్థితులకు అనుగుణంగా ఏం చేయాలనుకున్నా మీ ఇష్టం. ఇకపై అక్కడ ఒక్క చెట్టుకూడా నేలకొరగకూడదు'' అని జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టంచేశారు. కేంద్ర సాధికార కమిటీ సమర్పించిన నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. పర్యావరణ పునరుద్ధరణ ప్రణాళికనూ ఆలోపు సమర్పించాలంటూ తదుపరి విచారణను మే 15కు వాయిదా వేశారు.

### * ప్రైవేటు అటవీ భూముల్లో చెట్లు కొట్టేయాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే

ఈ భూమిని తాకట్టు పెట్టిన విషయాన్ని తెలంగాణ సీఎస్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని అమికస్‌క్యూరీ పరమేశ్వరన్ చేసిన వాదనలతో జస్టిస్ గవాయ్ విభేదించారు. ''ఈ భూమి యాజమాన్య హక్కులు ఎవరివన్న విషయం జోలికి మేం వెళ్లడంలేదు. దాన్ని ధ్రువీకరించే అధికారం సీఈసీకి లేదు. అక్కడ చెట్లు కొట్టేశారా? లేదా? ఒకవేళ కొట్టేసి ఉంటే అందుకు అనుమతులున్నాయా? లేదా? అనుమతులు లేకుండా ఎన్ని చెట్లు కొట్టేశారు? అన్నది చూడటం వరకే సీఈసీ బాధ్యత. ప్రైవేటు అటవీ భూముల్లో చెట్లు కొట్టేయాలన్నా కోర్టు అనుమతి తీసుకోవాల్సిందే. ముంబయిలోని ఆరే ప్రాంతంలో మెట్రో డిపో నిర్మాణానికి హైకోర్టు అనుమతిచ్చిన తర్వాతే చెట్లు కొట్టేయాల్సి వచ్చింది.

## రూ.27 వేల కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి సమక్షంలో రూ.27 వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి రెడ్కోతో ఈకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ సందర్భంగా భట్టి మాట్లాడారు. ''సుమారు 5,600 మెగావాట్ల హరిత ఇంధన ప్లాంట్ల ఏర్పాటుకు ఈ రెండు కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు సన్ పెట్రో అనే కంపెనీ 3,400 మెగావాట్ల సామర్థ్యంతో పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రూ.20వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందం చేసుకుంది. అలాగే మేఘా కంపెనీ రూ.7,500 కోట్ల పెట్టుబడులతో రూ.1,500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ముందుకు వచ్చింది. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగి 17,162 మెగావాట్లకు చేరినా కోతలు లేకుండా సరఫరా చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ సంస్థల సర్వేల ప్రకారం రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 2035 నాటికి 31,809 మెగావాట్లకు పెరగనుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాన్ని కాలుష్యానికి దూరంగా ఉంచాలనే సంకల్పంతో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై దృష్టి సారించాం. సరళమైన నిబంధనలతో అనేక కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయి. తాజాగా ఒప్పందం చేసుకున్న కంపెనీలు ప్రణాళికను రూపొందించుకొని, నిర్ణీత గడువులోగా పనులు పూర్తిచేయాలి'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆర్యా ఎండీ దీపక్ అగర్వాల్, ఈకోరెన్ ఎనర్జీ సీఎండీ ప్రసాద్ యెర్నేని, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ జీఎం మజుందార్, రాష్ట్ర ఇంధనశాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్, రెడ్కో ఎండీ అనిల తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతల కన్నీటి రాశులు

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాల్లో కేంద్రాలు ప్రారంభించి పక్షం రోజులు కావొస్తున్నా కొనుగోలు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ధాన్యంలో తేమ, తాలు కోసం రోజుల తరబడి ఆరబోస్తున్నా.. కాంటా వేసే సమయంలో గరిష్ఠంగా రెండు కిలోల వరకు కోతలు విధిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల మూలంగా అన్ని కేంద్రాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, టెంట్లు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించాలని నిబంధనలు ఉన్నప్పటికీ వందశాతం ఎక్కడా అమలు చేయడం లేదు. నల్గొండలోని మిర్యాలగూడ, హుజూర్‌నగర్ లాంటి ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసే ఓపిక లేక.. ఇక్కడి కేంద్రాల్లో విధించే కొర్రీలు, ఆరబోసేందుకు ఖర్చులు భరించలేక.. పొలం నుంచి నేరుగా మిల్లర్లు నిర్ణయించిన ధరలకే అప్పగించి వెళుతున్న పరిస్థితులున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లు పరిమిత సంఖ్యలో ఉండటం వల్ల ఎక్కువ సంఖ్యలో ధాన్యం తెచ్చిన రైతులు ఎదురుచూపులు చూడాల్సి వస్తుంది.

### కొనుగోలు అంతంతే..

ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా 12.69 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఇందులో 4.80 లక్షల ఎకరాలకు పైగా సన్నరకాలను, మిగిలినవి దొడ్డురకాలను రైతులు పండించారు. మొత్తం 8 లక్షల టన్నుల ధాన్యం సేకరించేందుకు అధికారులు కేంద్రాలను ఏర్పాటు చేశారు. నల్గొండలో 384 కొనుగోలు కేంద్రాలుంటే ఇప్పటి వరకు కేవలం 30 శాతం మాత్రమే కొనుగోలు చేశారు. సూర్యాపేటలో 311 కేంద్రాల్లో 20శాతం, యాదాద్రి భువనగిరిలో 372 కేంద్రాల్లో 40శాతం మేర ధాన్యం కొనుగోలు చేశారు. పలు మండలాల్లో ధాన్యం వర్షానికి తడిసిముద్దయ్యింది. ఖమ్మం జిల్లాలో మొత్తం 1,38,281 ఎకరాల్లో సన్నాలు, 87,029 ఎకరాల్లో దొడ్డురకం వరి సాగుచేశారు. 2.59లక్షల టన్నుల ధాన్యం సేకరించేలా అధికారులు 344 కేంద్రాలను తెరిచినా 40 శాతంలోపే కొనుగోలు చేశారు. కూసుమంచి, నేలకొండపల్లి, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, చింతకాని, ఖమ్మం అర్బన్, వేంసూరు మండలాల్లో అకాల వర్షాలకు వరి పంట దెబ్బతినగా కొనుగోలు కేంద్రాల్లోనూ అక్కడక్కడ ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి.

## చైనాపై 245 శాతానికి సుంకాలు

(మొదటిపేజీ తరువాయి)

గ్రేట్ ఎగైన్' కోసం ఆయన పని చేస్తున్నారు. 75కు పైగా దేశాలు కొత్త వాణిజ్య ఒప్పందాల కోసం ఇప్పటికే మమ్మల్ని సంప్రదించాయి. అందుకే సుంకాలను ప్రస్తుతానికి నిలిపేశాం. ఒక్క చైనాపై తప్ప' అని మంగళవారం శ్వేతసౌధం విడుదల చేసిన వాస్తవ పత్రం వెల్లడించింది. అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తులపై చైనా ప్రస్తుతం 245 శాతం సుంకాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆ పత్రం వివరించింది. గతంలో అమెరికా ఉత్పత్తులపై 84 శాతం సుంకాలను విధించిన చైనా.. శుక్రవారం వాటిని 125 శాతానికి పెంచింది.

### చైనా చర్చల ప్రతినిధిగా చెంగాంగ్

అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో బుధవారం చైనా.. లీ చెంగాంగ్‌ను తమ చర్చల ప్రతినిధిగా నియమించింది. అంతర్జాతీయ చర్చల్లో ఆయనకు దశాబ్దాల అనుభవం ఉంది. అంతేకాకుండా ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా రాయబారిగా పని చేశారు. చర్చల అంశం చైనా కోర్టులోనే ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

## మీరు సాయం చేస్తే.. పుంజుకుంటాం

ఆంధ్రప్రదేశ్‌కు సొంతంగా వచ్చే ఆదాయం కంటే అప్పులపై చెల్లించాల్సిన వడ్డీలు, పెన్షన్లు, జీతాలకు ఖర్చు చేసే మొత్తం ఎక్కువగా ఉంటోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల విధ్వంసం, ఆర్థిక క్రమశిక్షణ కొరవడడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టలేకపోవడం రాష్ట్రానికి భారీ నష్టం కలిగించిందని చెప్పారు. 'మేము నిలబడేందుకు, ముందడుగు వేసేందుకు ఈరోజు మీరు సాయం చేయండి.. రేపటికి పుంజుకుంటాం.. మాకున్న బలంతో అనూహ్య విజయాలు సాధిస్తాం.. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో మా వంతు పాత్ర పోషిస్తాం. దేశ నిర్మాణంలో ముఖ్య రాష్ట్రంగా నిలుస్తాం' అని విశ్వాసం వెలిబుచ్చారు. 'రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి.. ఏపీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం అదనపు కేటాయింపులు చేసేలా సిఫారసు చేయండి' విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా బుధవారం సచివాలయానికి వచ్చిన 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగడియా, సభ్యులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా ఎదురెళ్లి స్వాగతం పలికారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరంబనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు తదితర అంశాలపై ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించారు. స్వర్ణాంధ్ర 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పాలసీలను తెలియజేయడంతోపాటు.. రాజధానిపై ఆలోచనలను వీడియో ద్వారా ప్రదర్శించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 201419 మధ్య సాధించిన ప్రగతి, వైకాపా ప్రభుత్వ హయాంలో ఆర్థిక విధ్వంసం, 10 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో తీసుకున్న చర్యలు తదితర అంశాలపై ప్రజంటేషన్ ఇచ్చారు. 'వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలదే ముఖ్యపాత్ర. ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి వర్టికల్ డెవల్యూషన్ వాటా పెంచాలి' అని కోరారు.

## 21న ప్రధానితో వాన్స్ భేటీ

దిల్లీ: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ నెల 21న భారత్ పర్యటనకు రానున్నారు. తన సతీమణి, తెలుగు మూలాలున్న ఉషా వాన్స్, పిల్లలు ఇవాన్, వివేక్, మీరాబెల్‌లతో కలిసి ఆయన 24వ తేదీ వరకూ అనధికారికంగా దేశంలో పర్యటిస్తారు. ఆయనది పూర్తిగా ప్రైవేటు పర్యటనే అయినా.. ప్రధాని మోదీతో 21న భేటీ కానున్నారు. సుంకాలతోపాటు ఆర్థిక, భౌగోళిక రాజకీయ అంశాలు వారి మధ్య చర్చకు వచ్చే అవకాశముందని వాన్స్ కార్యాలయం ఒక ప్రకటనను విడుదల చేసిందని దిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం బుధవారం వెల్లడించింది. వాన్స్ పర్యటన వివరాలను భారత విదేశీ వ్యవహారాల శాఖ కూడా ప్రకటించింది.

* భారత పర్యటనలో భాగంగా తన కుటుంబంతో కలిసి దిల్లీ, ఆగ్రా, జైపుర్‌లను వాన్స్ సందర్శిస్తారు. భారత్‌కు వచ్చీ రాగానే వాన్స్ దంపతులు దిల్లీలోని ఎర్ర కోట సందర్శనకు వెళ్తారు.
* మధ్యాహ్నం సమయంలో జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో, విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డాతో వాన్స్ సమావేశమవుతారు.
* ఆ తరువాత తమ పిల్లలతో కలిసి వాన్స్ దంపతులు ప్రధాని మోదీని కలుస్తారు. వారికి సాయంత్రం ప్రధాని విందు ఇస్తారు.
* 22న వాన్స్ కుటుంబం జైపుర్‌లో పర్యాటక ప్రదేశాలను సందర్శిస్తుంది.

## కరెంటునూ దాచుకోవచ్చు.. వాడుకోవచ్చు!

అమరావతి: రాష్ట్రంలో మరో వెయ్యి మెగావాట్ అవర్స్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజి సిస్టం (బీఈఎస్ఎస్) ఏర్పాటుకు కేంద్రం అనుమతించింది. వాటికి వయబిలిటి గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) కింద కేంద్రం గ్రాంటు ఇవ్వనుంది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బీఈఎస్ఎస్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతులు ఇచ్చింది. మొత్తంగా 3,000 మెగావాట్ల విద్యుత్ నిల్వ ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్రంలో సుమారు 19,000 మెగావాట్ల విద్యుత్ ఒప్పందాలు ఉంటే.. అందులో పునరుత్పాదక విద్యుత్ (పవన, సౌర విద్యుత్) ఒప్పందాలు 7,800 మెగావాట్ల ఉన్నాయి. వాటి నుంచి వచ్చే విద్యుత్‌ను మస్ట్ రన్ విధానంలో తీసుకోవాలి. దీనివల్ల పగటి వేళల్లో ఇప్పటికే సుమారు 1,500 మెగావాట్ల మిగులు విద్యుత్ ఉంటోంది. ఏడాదిలో మరో 10,000 మెగావాట్ల పునరుత్పాదక ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి రానుంది. అది కూడా అందుబాటులోకి వస్తే గ్రిడ్ బేస్‌లోడ్ నిర్వహణకు ఇబ్బందిగా ఉంటుందని విద్యుత్ సంస్థలు భావిస్తున్నాయి. ఈ కారణంగా విద్యుత్ నిల్వ చేసేందుకు కొత్తగా వచ్చిన బీఈఎస్ఎస్ సాంకేతికత ద్వారా 4,000 మెగావాట్ అవర్స్ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదన పంపింది. ఇప్పటికే 2,000 మెగావాట్ అవర్స్ బీఈఎస్ఎస్ ప్రాజెక్టులకు ఇంధన శాఖ టెండర్లు పిలిచింది.

### థర్మల్ విద్యుత్ బ్యాక్‌డౌన్ చేసిన తర్వాతా..

రాష్ట్రంలో పగటి వేళల్లో విద్యుత్ డిమాండ్ ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ఏదో ఒక టైం బ్లాక్‌లో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 13,000 మెగావాట్ల వరకు ఉంటున్నా.. ఎక్కువ టైం బ్లాక్‌లలో (ఒక టైం బ్లాక్ 15 నిమిషాలు) డిమాండ్ 8,000 మెగావాట్ల నుంచి 8,500 మెగావాట్ల మధ్య ఉంటోంది.

## సరికొత్త సచివాలయం

అమరావతి: రాష్ట్ర పరిపాలన కొలువుదీరే ఐకానిక్ టవర్ల నిర్మాణానికి సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. సమీకృత రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు వీటిలో రానున్నాయి. మొత్తం ఐదు టవర్లను గతంలో మాదిరే ఈసారీ మూడు ప్యాకేజీల కింద విభజించారు. రూ.4,688.82 కోట్ల అంచనా వ్యయంతో బిడ్లు ఆహ్వానించారు. నాన్ ఎస్ఓఆర్ ధరలను ఇటీవలే ఖరారు చేయడంతో టెండర్లకు మార్గం సుగమమైంది. వచ్చే నెల 1న మధ్యాహ్నం 3 గంటల వరకు బిడ్లు దాఖలు చేసేందుకు గడువు నిర్దేశించారు. సాంకేతిక బిడ్లను అదే రోజు సాయంత్రం 4 గంటలకు తెరవనున్నారు. ఐకానిక్ టవర్ల నిర్మాణానికి గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.2,703 కోట్లతో టెండర్లు పిలిచారు. వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల వైఖరి కారణంగా ఇప్పుడు అంచనా వ్యయం 73 శాతం ఎగబాకింది. ప్రస్తుతం మొదటి ప్యాకేజీ కింద రూ.1,126.51 కోట్లతో జీఏడీ టవర్ నిర్మాణం, రెండో ప్యాకేజీలో రూ.1,897.86 కోట్లతో 1, 2 టవర్లు.. మూడో ప్యాకేజీ కింద రూ.1,664.45 కోట్లతో 3, 4 టవర్లు నిర్మించనున్నారు.

### డయాగ్రిడ్ విధానంలో నిర్మాణం

* ఐకానిక్ టవర్ల ఆకృతులను డయాగ్రిడ్ విధానంలో ఫోస్టర్స్ సంస్థ రూపొందించింది.
* అన్నింటి కంటే ఎత్తుగా నిర్మించనున్న జీఏడీ టవర్ బేస్‌మెంట్, గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా 47 అంతస్తులుగా నిర్మించనున్నారు. ఇందులోనే ముఖ్యమంత్రి కార్యాలయం రానుంది. దీని టెర్రస్‌పై సీఎం ప్రయాణాల కోసం హెలిప్యాడ్ నిర్మించనున్నారు.
* మిగిలిన నాలుగు హెచ్‌ఓడీ టవర్లనూ 39 అంతస్తుల చొప్పున నిర్మిస్తారు.
* ఐకానిక్ టవర్ల మొత్తం విస్తీర్ణం 68.88 లక్షల చదరపు అడుగులు.

## అనుమతులన్నీ తీసుకున్నాకే పనులు చేపట్టాం

హైదరాబాద్: కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలు అటవీ భూములు కావని, ప్రభుత్వ పోరంబోకు/బంజరు భూములని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి స్పష్టంచేశారు. అన్ని అనుమతులు తీసుకున్నాకే రూ.50 వేల కోట్ల పెట్టుబడులతో లక్ష ఉద్యోగాల కల్పనకు ఈ భూమి అభివృద్ధి ప్రారంభించినట్లు తెలిపారు. దాదాపు ఇరవై ఏళ్లపాటు న్యాయపరమైన వివాదాల్లో ఉండటం, వినియోగంలో లేకపోవడంతో అక్కడ చెట్లు పెరిగాయన్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో సమగ్ర వివరాలను వెల్లడించారు. ఇందులో ముఖ్యాంశాలు... కంచ గచ్చిబౌలిలోని సర్వే నంబరు 25లో 2374.02 ఎకరాల భూములున్నాయి. వీటిలో ఐదు నీటి కుంటలున్నాయి. ఇది 'కంచ పోరంబోకు సర్కారీ భూమి'గా నమోదై ఉంది. 1975లో 2,324.05 ఎకరాల పొజిషన్‌ను యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్(హెచ్‌సీయూ)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. అయితే వర్సిటీ పేరిట ఫైనల్ ఎలైనేషన్ ఉత్తర్వులు జారీ కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో ఇప్పటికీ ప్రభుత్వ భూమిగానే ఉంది. హెచ్‌సీయూకి విశాలమైన ఖాళీ భూములున్నాయి. వాటికి, ప్రస్తుత 400 ఎకరాలకు మధ్య ఎలాంటి ఫెన్సింగ్ లేదు. వర్సిటీతోపాటు చుట్టుపక్కల భూముల్లో సంచరించే జింకలు, నెమళ్లు, ఇతర పక్షులు ఈ భూముల్లో వచ్చి పోతుంటాయి. ఈ 400 ఎకరాలను గతంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోసం అభివృద్ధి చేసేందుకు ఐఎంజీ అకాడమీస్ భారత ప్రైవేట్ లిమిటెడ్‌తో 2003 ఆగస్టు 9న ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్రమంలో 400 ఎకరాలను హెచ్‌సీయూ నుంచి తీసుకొని 2004 ఫిబ్రవరి 3న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ(శాప్)కి అప్పగించింది.

# డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వారసత్వాన్ని గౌరవిస్తూ ఎంఈఏ, ఇండియన్ మిషన్లు

హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత రాజ్యాంగ నిర్మాతలలో ఒకరైన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను గౌరవించేందుకు విదేశాంగ మంత్రిత్వ శాఖ, విదేశాల్లోని దాని భారతీయ మిషన్లు అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ భారతీయ మిషన్లు ఆయన వారసత్వాన్ని జరుపుకోవడానికి, న్యాయం, సమానత్వం, సామాజిక సంస్కరణలకు ఆయన చేసిన శాశ్వత సహకారాన్ని హైలైట్ చేయడానికి సమావేశాలు మరియు సెమినార్లను నిర్వహించాయి. న్యూయార్క్ లోని ఐక్యరాజ్యసమితికి చెందిన ఇండియన్ మిషన్ డాక్టర్ అంబేద్కర్ 134వ జయంతిని యుఎన్ లో ప్రత్యేక కార్యక్రమంతో జరుపుకుంది. సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి డాక్టర్ రాందాస్ అథవాలే "ఐక్యరాజ్యసమితిలో అంతకు ముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్




దృక్పథం కాలాతీత విజ్ఞప్తి" అనే కార్యక్రమంలో కీలక ప్రసంగం చేశారు. తన ప్రసంగంలో, డాక్టర్ అంబేద్కర్ ఆదర్శాలను పరివర్తన చర్యలోకి తీసుకురావడానికి భారతదేశం చేపట్టిన అనేక కార్యక్రమాలను మంత్రి నొక్కి చెప్పారు.టోక్యోలో, భారత రాయబార కార్యాలయం ఒక స్మారక కార్యక్రమాన్ని నిర్వహించింది, దీనిలో రాయబారి సిబి జార్జ్, రాయబార కార్యాలయ సిబ్బంది, భారత ప్రవాసులు డాక్టర్ అంబేద్కర్ శాశ్వత సమానత్వం మరియు న్యాయం వారసత్వంపై పుష్పగుచ్ఛాలు అర్పించి ప్రసంగించారు. అదేవిధంగా, న్యూజిలాండ్‌లోని భారత హైకమిషన్ ఒక నివాళి కార్యక్రమాన్ని నిర్వహించింది, ఇక్కడ హైకమిషనర్ నీతా భూషణ్, ఆమె బృందం డాక్టర్ అంబేద్కర్ జ్ఞాపకార్థం గౌరవించారు. భారత రాజ్యాంగ నిర్మాతగా, మార్గదర్శక విద్యావేత్తగా సామాజిక సంస్కరణల విజేతగా ఆయన పాత్రను ప్రతిబింబించడానికి భారతీయ సమాజ సభ్యులు కూడా సమావేశమయ్యారు. మంగోలియాలోని భారత రాయబార కార్యాలయం మంగోలియా రాజ్యాంగ న్యాయస్థానం, మంగోలియా జాతీయ విశ్వవిద్యాలయంలోని రాజ్యాంగ న్యాయ సంస్థ, మంగోలియాలోని భారతీయ అధ్యయన కేంద్రంతో భాగస్వామ్యంతో "దేశ నిర్మాణంలో భారతదేశం మంగోలియా రాజ్యాంగాల సహకారం" అనే సమావేశాన్ని నిర్వహించడం ద్వారా నివాళులర్పించింది. ఈ కార్యక్రమం భారత రాజ్యాంగాన్ని స్వీకరించిన 75వ వార్షికోత్సవం భారతదేశంమంగోలియా దౌత్య సంబంధాల 70వ వార్షికోత్సవాన్ని కూడా సూచిస్తుంది. ఈ ప్రపంచ స్మారక కార్యక్రమాలు డాక్టర్ బి.ఆర్. పట్ల ఉన్న లోతైన గౌరవాన్ని ప్రతిబింబిస్తాయి.

## వరంగల్ సభ విజయవంతాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ వీ పాదయాత్ర

**- వేములకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వరకు పాదయాత్ర**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించ తలపెట్టిన బిఆర్ఎస్ సిల్వర్ జూబ్లీ బహిరంగ సభ విజయవంతం కావాలని కోరుతూ బిఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టిన విషయం విధితమే. వేములకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుంచి తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద దేవాలయం యాదగిరిగుట్ట లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం వరకు చేపట్టిన పాదయాత్ర బుధవారం రెండో రోజుకు చేరుకుంది. బీఆర్ఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్ పాదయాత్రలో పాల్గొన్నారు. పాదయాత్ర చేస్తున్న బీఆర్ఎస్ వీ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు నలపరాజు రమేష్ ను శాలువాతో సన్మానించారు. పాదయాత్ర చేస్తున్న సభ్యులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల భవిష్యత్ కోసం యువత చూపుతున్న అంకితభావం అభినందనీయమన్నారు. వరంగల్ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వైసంస్థాన్ నారాయణపురం మండలం అధ్యక్షుడు ఆడెపు సురేష్‌కుమార్, బీఆర్ఎస్ వీ నాయకులు నక్క సుదీర్, తరుణ్ నాయక్, శేఖర్ గంగాదేవి శివ, చుక్క స్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం పాఠశాల ప్రచార కరపత్రిక ఆవిష్కరణ



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ ఉన్నత పాఠశాల రామవరం పాఠశాల ప్రచార కరపత్రికను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల సాధిస్తున్న ప్రగతిని ఆయన ప్రశంసించారు. గత పదవ తరగతి పబ్లిక్ ఫలితాలలో 96% ఫలితాల సాధన, గుణాత్మక బోధన, దాదాపు అన్ని ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా పాఠశాలలో ఖచ్చితంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా పాఠశాల నిర్వహించడం అభినందనీయమన్నారు. బీద విద్యార్థులు సంక్షేమార్థం తీసుకుంటున్న అనేక సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించాల్సిందిగా హెచ్ఎం ప్రభుదయాల్ ను కోరారు.

### జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్

## కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి

*** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తున్న జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే ఈ కార్యక్రమంలో మీరందరూ పాల్గొని మీ వంతు బాధ్యతను మీరు నిర్వహిస్తున్నందుకు ఎంతో గర్వపడుతున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 13వ రోజు నిజాంపేట్ 13, 14వ డివిజన్ లోని పాదయాత్ర కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు అందజేస్తూ ప్రజల మధ్యకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని పెద్ద ఎత్తున పాదయాత్ర జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హనుమంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనతో పాటు ఎన్ ఎం సి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ప్రతి డివిజన్లకు కాలినడకతో ప్రజల మధ్యకు వెళ్లి మన దేశం గొప్పతనం మన రాజ్యాంగం గొప్పతనం తెలుపుతూ ప్రజలలో చైతన్యం కలిగిస్తూ ముందుకు వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమన్నారు. ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపునిచ్చారన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుంటూ మీకు మేమున్నాం అనే హామీని ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కడియాల ఇందిరా, జగదీష్ యాదవ్, జగన్ యాదవ్, వెంగయ్య చౌదరి, చిట్ల దివాకర్, సురేష్ యాదవ్, కుమార్ యాదవ్, మామిళ్ళపల్లి శ్రీనివాస్, లింగాల గంగాధర్, టేకుల ప్రవీణ్, వర్మ రాజు, వీరబాబు, జక్కా మధుసూదన్, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, ఏలూరి సత్య (నాని), కృష్ణమరాజు, శ్రీశైలం యాదవ్, పితాని శ్రీనివాసరావు, మల్లికార్జున్, కోటేశ్వరి, సయ్యద్ రఫత్, ఆలేటి శ్రీనివాస్, సాంబశివరావు, ఆంజనేయ వర్మ, సురేందర్ యాదవ్, నారాయణరెడ్డి, సురేష్ యాదవ్, ఈశ్వర్ కిరణ్, అజయ్, మౌలాలి, సునీల్, నానాజీ, దినేష్, దయానంద్, సీమన్, విజయ్, స్వామి దాస్, ఫిలిప్స్, కురుమ శ్రీనివాస్, వెంకటేష్, సంతోష్, పందు, పంగా శ్రీనివాసరావు, సుబ్బి రామిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శ్రీదేవి, గంధం పృథ్వి, గంధం సాయిలీల, వాణిశ్రీ, కరుణాకర్, సుబ్రహ్మణ్యం, ఆదర్శ కాలనీ ఆంజనేయులు, మద్ది నారాయణరెడ్డి, బండ్ల విజయ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, గూడూరు మురళి, మందపు రమేష్, పంగా శ్రీనివాసరావు, వెంకట్, ఫణి, ప్రసాద్, మౌళేశ్వర రావు, శ్రీనివాస్ రాజు (మీసాల రాజు), ప్రేమ్ కుమార్, ప్రభాకర్, సరళ లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, ఆటో శ్రీను, సురేష్, శివ నాగరాజు యాదవ్, చిరంజీవి, లక్ష్మణ్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మహిపాల్, గోలి శ్రీనివాస్, అరవింద, నాయుడు, కృష్ణ, సత్యనారాయణ, మహమూద్, నవీన్, లోకనాథ్, డింపుల్, మేకల క్రాంతి, నర్సింగ్ రావు, బాలాజీ, రమ, శ్రీదేవి, యశోద, గిరిజా కుమారి, కరుణ, సునీత, స్వప్న, లక్ష్మి, త్రివేణి, మాధవి, జ్ఞానేశ్వరి, సరిత రెడ్డి నగీన, రాధా, ఉష, మార్తమ్మ, ధనలక్ష్మి, ఎన్ సత్యవతి, ఎం సత్యవతి, నవ్య, పార్వతమ్మ, లక్ష్మి, కాళీమా, అంబిక, వాణి, పాపమ్మ, సునీత, పుష్ప, లక్ష్మి, నాగమణి, చిన్ని, దట్ల రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలి

*** ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : తడి చెత్త పొడి చెత్త వేరు చేసి చెత్త సేకరించే ఆటోలలో మాత్రమే వేయాలని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి జరిమానా విధించి ఇంకోసారి చెత్తను రోడ్లపై వేయకూడదని హెచ్చరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను వీధుల్లోనూ, కాలువలోను, చెరువుల్లోనూ, రోడ్లమీద వేయకుండా. కొంతమంది ఆటోలలో వచ్చి ఇక్కడ చెత్తను వేస్తున్నట్లు గుర్తించామన్నారు. అట్టి వారికి కూడా జరిమానా వేసి మందలిస్తామని అన్నారు. పారిశుధ్య కార్మికులకు సహకరించి, మీ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుని రోగాల బారిన పడకుండా చూసుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, మోజెస్, ఎస్.ఆర్. పి నాగేశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

**- వ్యవసాయ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన తమ పంటను మధ్య దళారులకు అమ్మి మోసపోవద్దని చౌటుప్పల్ వ్యవసాయ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. చౌటుప్పల్ మండలం ఎస్ లింగోటం, నేలపట్ల, మందోళ్ళగూడెం, మల్కాపురం, అల్లాపురం, ఎనగంటి తండా తదితర గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి, మద్దతు ధర పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణ, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు, ఏసీ నాయక్, ఉప్పు భద్రయ్య, చెన్నగోని అంజయ్య గౌడ్, వ్యవసాయ కమిటీ డైరెక్టర్లు ఢిల్లీ చంద్రకళ, సప్పిడి సంజీవరెడ్డి, ఎండి గౌస్ ఖాన్, పబ్బు శ్రీకాంత్ గౌడ్, బోయ వెంకట్, నాయకులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, పాశం సంజయ్ బాబు, అర్ధ వెంకట్ రెడ్డి, గోపనబోయిన మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మరల సర్వేతో గందరగోళపడుతున్న ప్రజలుఅధికారులు సర్వేపై స్పష్టత ఇవ్వాలి

*** లబ్ధిదారుడికి అత్తమామల ,తల్లిదండ్రుల ఆధార్ కార్డు లింక్ ఏంటో అధికారులు చెప్పాలి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ గృహాల నిర్మాణం కోసం అధికారులు మరల సర్వే చేస్తుండడం దేనికని సేవ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్ ప్రశ్నించారు. సర్వేపై అధికారులు ఇది కేంద్ర ప్రభుత్వ యాప్ సంబంధించిందని కొంతమంది మరల రీ సర్వే చేస్తున్నామని కొంతమంది చెప్తుండడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితా ప్రకటించి అందులో నుంచి అర్హుల జాబితా ప్రకటించడంలో కాలయాపన దేనికోసమని ఆయన అన్నారు. వార్డుల్లో కొంతమందికే అధికారులు ఫోన్లు చేస్తుండడం వెళ్లి వివరాలు సేకరిస్తుండడంతో ప్రజలు గందరగోళపడుతున్నారని ఆయన ఆవేదన



వ్యక్తం చేశారు. ఆన్ అర్హులు అవకాశం ఇస్తే నిరుపేదలతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు లబ్ధిదారుల జాబితా ప్రకటించాలని ఇండ్ల నిర్మాణం ప్రారంభించేలా ప్రయత్నం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

## సింగరేణి మెయిన్ హాస్పిటల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

*** ఏఐటియుసి ఆధ్వర్యంలో సీఎంఓకి వినతి**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పెరిగిన పని భారం కనుగునంగా రోజువారి విధులకు తీసుకునే కార్మికుల సంఖ్యను పెంచాలని,రక్షణ చర్యలు చేపట్టాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో బుధవారం నాడు మెయిన్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీ డాక్టర్ ఆర్ కిరణ్ రాజ్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కే డబ్ల్యూ కిష్టాఫర్ లు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు పైగా పనిచేస్తున్న హౌస్ కీపింగ్ మరియు క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు అరకోర మస్టర్లతో, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి నెలకు కనీసం 26 మాస్టర్లు వచ్చేటట్లుగా చర్యలు చేపట్టాలని నాయకులు కోరారు.సింగరేణి మెయిన్ హాస్పిటల్ రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కాంట్రాక్ట్ కార్మికులకు పెరుగుతున్న పని భారంను పరిగణలోకి తీసుకోవాలని,వారికి మెరుగైన వైద్యం,సరైన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్,విజయ్,రమేష్, రాంబాబు,లలిత, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**




ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా రహదారులపై ప్రమాదాలు జరగకుండా సమగ్రమైన రహదారి భద్రత ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. జిల్లాలో ఎక్కువ నిడివి కలిగిన జాతీయ రహదారులతో పాటు, ఆర్అండ్‌బీ, పంచాయతీ రహదారులు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో రహదారి భద్రతపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాణాలు పోకుండా తక్షణమే ఆసుపత్రులకు తీసుకెళ్లేందుకు అవకాశం ఉన్న దగ్గరి రహదారులు, హాస్పిటళ్లను ఎంపిక చేయాలని తెలిపారు. అంబులెన్స్‌లు, ట్రామా కేంద్రాలపై ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రమాదాలు సంభవించకుండా రహదారులపై సైన్ బోర్డులతో పాటు, రేడియం స్టిక్కర్లు, జీబ్రాలైన్లు, స్టాపేజీలు వంటి వాటిని ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో మోటార్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో రహదారి ప్రమాదాలు నానాటికి అధికమవుతున్నాయన్నారు. వాహనాలు కండిషన్‌గా లేకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని రహదారుల్లో ప్రమాదకరమైన మలుపుల వద్ద అడ్డుగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. రహదారులు వెంట ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్ళలో పార్కింగ్ ప్రదేశాలను గుర్తించాలన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటుచేసిన పోల్స్ మాదిరిగానే జిల్లావ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈ ఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ రాజ్ ఈ ఈ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, డి సి హెచ్ ఓ రవిబాబు, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ సుజాత , సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మండలం నుండి రాజపేటకు అక్రమంగా ఇసుక తరలింపు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : యాదగిరిగుట్ట మండలం ధర్మారెడ్డి గూడెం రెవెన్యూ పరిధిలోని గంధమల్ల వాగు నుండి రాజపేట మండలానికి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం వారు మీడియాకు తమ గోడును వివరించుకున్నారు."అక్రమ" "ఉసిక దంధా" మూడు పువ్వులు, ఆరుకాయలుగా నడుస్తున్నదని, ఈ వ్యాపారముతో రైతుల నోట్ల మన్ను పడుతున్నదని (పంటలు ఎండిపోయి) "వాల్టాచట్టాన్ని" ఉల్లంగిస్థూ రెవెన్యూ గ్రామ కార్యదర్శి, మండల స్థాయిలో ఇతర, అధికారుల కనుసన్నల్లోనే నడుస్తోందని విమర్శించారు. ఈ దందా గత రెండు నెలలుగా జరుగుతుండగా "గంధమల్లవాగు" పూర్తిగా నీరు పారినా ప్రయోజనము లేకపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించాలని కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు కూడా రూ.500 ల బోనస్ ఇస్తుంది

*** భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**



భువన గిరి, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం సన్న వడ్లకు కూడా రూ.500 ల బోనస్ ఇస్తుందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం బీబినగర్ మండలం బ్రాహ్మణపల్లి, చిన్నరావులపల్లి గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విదంగా మన తెలంగాణ రాష్ట్రంలో వరి పంట ఎక్కువ దిగుబడి అవుతుందని అన్నారు . మన ప్రభుత్వం వడ్లు త్వరగా కొనుగోలు చేస్తుందని కొన్న వెంటనే 3రోజుల్లోనే రైతుల కాతాలలో డబ్బులు జమ చేస్తున్నామని అన్నారు. గత టీఆరెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలు చేయడానికి రెండు నెలలు సమయం పట్టెదని, కేసీఆర్ వరి వేస్తే ఉరే అన్నారని గుర్తు చేసారు. బీసీ ఎస్సీ, ఎస్టీ, హాస్టల్లలో సన్నం బియ్యంతో అన్నం పెడుతున్నారని అన్నారు, దేశంలో ఎక్కడా లేని విధంగా తెల్ల రేషన్ కార్డు ధారులకు సన్నం బియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నారు.

## దిశ సమావేశంలో పాల్గొన్న ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




యాదాద్రి భువనగిరి జిల్లా, (ప్రజాస్ఫూర్తి) : యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన దిశ సమావేశానికి ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం పార్లమెంట్ సభ్యులు వివిధ శాఖల అభివృద్ధి పనుల సంబంధించిన పలు అంశాలపై అధికారులతో క్షుణ్ణంగా చర్చించి సమీక్షించారు.

## రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి

- **వైకుంఠ రథంకు వెంటనే మరమ్మత్తులు చేయించాలి**
- **మాజీ రైతు బంధు అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని రైతు బంధు మాజీ అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్ రావు డిమాండ్ చేశారు. ముస్తాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి ధాన్యం కొనుగోలు త్వరితగతిన చేపట్టాలని ఎండలు తీవ్రమైనందున మధ్యాహ్నం సమయంలో ఐకెపి సెంటర్ల దగ్గర టెంట్లు ఏర్పాటు చేయాలని, మంచినీటిని అందుబాటులో ఉంచాలని, రైతులకు గ్లూకోజ్ ప్యాకెట్స్, ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ముస్తాబాద్‌లో వైకుంఠ రథం రిపేరులో ఉన్నందున ఇతర మండలాల నుంచి వైకుంఠ రథం తెప్పించడం వల్ల ప్రజలపై అధికంగా ఆర్థిక భారం పడుతుందని, అధికారులు వెంటనే వైకుంఠ రథానికి మరమ్మత్తులు చేయించి వాడుకలోకి తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చెవుల మల్లేశం, సడిమెల ఎల్లం, మాజీ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు రచమడుగు సంతోష్ రావు, ముస్తాబాద్ మాజీ కోఆప్షన్ మెంబర్ అన్వర్, బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షులు శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగని మనోహర్, రజక సంఘం నాయకుడు యాదగిరి, నాయకులు అంకని రంజిత్, గొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు

*** నేరసమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా ఎస్పీ రోహిత్ రాజు బుధవారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని పోలీసు అధికారులందరితో నేర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా మార్చి నెలలో విధుల పట్ల అంకితభావంతో పనిచేసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.అనంతరం జిల్లాలోని పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్లో ఉన్న కేసులు వివరాలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి బాధ్యతగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.క్రికెట్ బెట్టింగులు,ప్రభుత్వ నిషేధిత గంజాయి అక్రమ రవాణా, ఇతర సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా పనిచేయాలని తెలిపారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ కృషి చేయాలని సూచించారు. పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని,డయల్ 100 నకు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలబడాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులు,సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.రాబోయే వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని దొంగతనాల నివారణకై ప్రజలను అప్రమత్తం చేస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని తెలియజేశారు.సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.జిల్లా ప్రజలు సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ అప్రమత్తం చేయాలని సూచించారు.శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎలాంటి అలసత్వం వహించారాదని అన్నారు.మద్యం సేవించి వాహనాలను నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వ్యక్తులపై నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు.ఈ సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,ఇల్లందు డిఎస్పీ చంద్రభాను,కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, సైబర్ క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్ , సీఐలు, ఎస్సైలు,జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ నీ అవమానించిన బండి రమేష్ వెంటనే క్షమాపణ చెప్పాలి



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజు అంబేద్కర్ నీ తీవ్రంగా అవమానించిన కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ వెంటనే క్షమాపణ చెప్పాలని దళిత ఐక్య వేదిక నాయకులు అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం దయార్ గూడ గ్రామంలో దేవుడిలా ప్రతిరోజూ పూజించే డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తీవ్రంగా అవమానించారని బుధవారం కూకట్ పల్లి ఆల్ పార్టీ నాయకులు, దళిత ఐక్య వేదిక వారు కలిసి వచ్చి కూకట్పల్లి వై జంక్షన్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి న దాయర్ గూడలో నిర్వహించిన బగ్గీ గుర్రపు బండిలో బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటం ఊరేగింపు చేయగా... అక్కడి కాంగ్రెస్ నాయకుల అత్యుత్సాహం బండి రమేష్ అవివేకం తోడై ర్యాలీలోని గుర్రపు బగ్గీలో అంబేద్కర్ చిత్రపటం కనిపించకుండా ఆయన స్థానంలో బండి రమేష్ పెళ్లికొడుకు మాదిరిగా ఎక్కి కూర్చొని కాలుమీద కాలు వేసుకొని ఫోటోలు దిగడం నిస్సందేహంగా అంబేద్కర్ ని అవమానించడమే అన్నారు. అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన అంబేద్కర్ జయంతి న "జై భీమ్ ల " సాక్షిగా ఓ అగ్రవర్ణ నాయకుడు దురహంకారంతో పెత్తందారీ పోకడలతో అవమానపరిచినా చూస్తూ ఫోటోలు తీస్తూ సంబరపడ్డ దళిత వర్గాల నాయకులు నిజంగా సిగ్గుతో తలదించుకోవాల న్నారు. దేశోద్ధారకుల పట్ల ఆయనకున్న "అజ్ఞానానికి అద్దం పడుతుంది." ఇంత ఘోర తప్పిదానికి పాల్పడిన బండి రమేష్ తక్షణమే క్షమాపణ చెప్పాలి అంటూ జరిగిన ఘోర అవమానానికి తక్షణమే బండి రమేష్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రమేష్ కి సహకరిస్తూ వత్తాసు పలుకుతున్న దళిత నాయకులు కూడా క్షమాపణలు కోరాలని డిమాండ్ చేశారు.



## ప్రజల్ని ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదు

*** కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.**

కూకట్ పల్లి, ( ప్రజాస్ఫూర్తి) : గత పదేళ్ల కాలంలో మంచినీటికి ఎప్పుడు ఇబ్బంది పడిన దాఖలాలు లేవని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయానికి నియోజకవర్గానికి చెందిన మహిళలు వచ్చి తమ గోడు వెళ్ళబోసుకున్నారు .ఈ సందర్భంగా నియోజకవర్గంలో మంచినీరు అందక చాలా ఇబ్బంది పడుతున్నామని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు బిందెలతో ఏ విధంగా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉందో... ఇప్పుడు అలాగే ఉందని అన్నారు. ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయక, తమ బోరులు వేసుకుంటే అవి కూడా తీసుకెళ్లిపోయి అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తున్నారని... తాము ఎలా బతకాలని విలపించారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ. ప్రజల్ని ఇబ్బంది పెడితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ప్రజలకు కనీసం మంచినీళ్లు కూడా అందనీయకుండా వారిపై ఈ విధంగా అక్రమంగా కేసులు పెట్టి వేధించడం ఎంతవరకు సబబుఅని అన్నారు. వారికి మంచినీరు ఇవ్వక.. వారు వేసుకున్న బోర్లను తీసుకెళ్లిపోయి.. మీరేమో నీళ్ల ట్యాంకులను బయటకు అమ్ముకుంటారని అధికారులు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే పరంపర కొనసాగితే మంచినీటి సరఫరా కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేయాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. తక్షణమే ఇటువంటి చర్యలు ఉపసంహరించుకోవాలన్నారు. ప్రజలకు ఏమాత్రం ఇబ్బంది కలిగినా ఊరుకునే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.

## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఎంపికి వినతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జర్నలిస్టుల సమస్యలపై బుధవారం ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కలెక్టర్ ఎం హనుమంతరావు కు టీయూడబ్ల్యూజే (ఐజేయు) పక్షాన వినతి పత్రాలు అందజేయడం జరిగింది. అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలలో అవకాశం కల్పిస్తామని, జిల్లాలోని ఇళ్లస్థలాల పట్టాలు వున్న జర్నలిస్టులకు స్థలాల కేటాయింపు పై హామీ ఇచ్చారు. బీబీనగర్ ఎయిమ్స్ లో జర్నలిస్టుల వెల్నెస్ సెంటర్ ఏర్పాటు, అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టుల కుటుంబాలకు ఓపి సేవలలో ప్రాధాన్యత ఇవ్వాలని ఎయిమ్స్ అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యంబ నరసింహులు, పోతంశెట్టి కరుణాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లేశం, సీనియర్ జర్నలిస్టులు,యూనియన్ నాయకులు జీవి శ్రీనివాస్, కె సోమయ్య, జి హరిబాబు, కె మల్లేశం,పి ఆనంద్, పాశం నవీన్, ఎం డి జమాల్, మహేష్, ఉదయ్ రెడ్డి, దిలీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గుజరాత్ నుంచే మార్పు మొదలు : రాహుల్ గాంధీ

కేవలం కాంగ్రెస్ మాత్రమే భాజపా, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ను ఓడించగలదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన గుజరాత్ పర్యటనలో భాగంగా జిల్లా నాయకులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో పార్టీ వ్యూహాన్ని కూడా ఆయన వెల్లడించారు. గుజరాత్‌లో పార్టీ నైతిక స్థైర్యం దెబ్బతిన్నా.. భాజపాను ఓడించగలమని ధీమా వ్యక్తం చేశారు. మార్పు గుజరాత్ నుంచే మొదలవుతుందని అభివర్ణించారు. పార్టీ అంతర్గత సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్రంలో కొత్త నాయకత్వం వస్తుందని పేర్కొన్నారు. ఈ అంశంపై పార్టీ అధ్యక్షుడు ఖర్గే సహా సీనియర్లు మొత్తం కొన్ని నెలల నుంచి చర్చిస్తున్నట్లు వెల్లడించారు. "ప్రస్తుతం జరుగుతున్న పోరాటం కేవలం రాజకీయం మాత్రమే కాదు. ఇది భావజాలానికి కూడా సంబంధించింది. భాజపా, ఆర్ఎస్ఎస్‌ను ఓడించగలిగేది కేవలం కాంగ్రెస్ పార్టీనే అని ప్రజలకు తెలుసు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. పార్టీలోనే నాయకుల మధ్య నెలకొన్న వర్గపోరు, స్థానిక నాయకులకు టికెట్లు రాకుండా చేయడం వంటివి ఆందోళనకరమన్నారు. పార్టీలో మార్పులు తీసుకురావడం అవసరమని తాము భావిస్తున్నట్లు



రాహుల్ వెల్లడించారు. తాను జిల్లా నాయకులతో మాట్లాడినట్లు చెప్పారు.

**నాయకత్వం అలా ఉండాలి..**

ఇక పార్టీ నాయకత్వ పాత్ర ఎలా ఉండాలో రాహుల్ వివరించారు. "రెండు రకాల హీరోలు ఉంటారు. ఒకరు పోటీలకు.. మరొకరు పెళ్లిళ్లకు. కాంగ్రెస్ పార్టీ పెళ్లి హీరోలను రేసులకు.. రేసుల హీరోలను పెళ్లిళ్లకు పంపుతోందని చాలా మంది నాతో చెప్పారు. ఈ హీరోలను గుర్తించి ముందు వేరుచేయాలి. జిల్లాల్లో పార్టీని స్థానికంగానే నడిపించాలి. ఆర్గనైజేషన్‌కు.. అభ్యర్థులకు మధ్య బలమైన సంబంధాలుండేట్లు చూసుకోవాలి" అని రాహుల్ పేర్కొన్నారు. ఎవరికి తగిన పాత్ర వారికి కేటాయించాలని ఆయన నొక్కిచెప్పారు. అహ్మదాబాద్ నుంచి సీనియర్ నాయకులు వచ్చినప్పుడు కొందరు హడావుడి చేసి ఆ తర్వాత జాడ లేకుండా పోతున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అభియోగపత్రం నమోదు చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ శ్రేణులు దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ సమయంలో రాహుల్ గుజరాత్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకొంది.

## ఈడీని రద్దు చేయాలి

**: అఖిలేశ్ యాదవ్**



కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఏర్పాటు అయ్యిందని, ఇప్పుడు అదే సంస్థ నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటోందని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. ఆర్థిక సంబంధిత నేరాలను దర్యాప్తు చేసేందుకు ఇతర ఏజెన్సీలు ఉన్న నేపథ్యంలో ఈడీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒడిశాలో పర్యటనలో ఉన్న అఖిలేశ్.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లపై ఈడీ ఛార్జిషీటు దాఖలును వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ నిరసనలు చేస్తుండడంపై ఇలా స్పందించారు. "నేషనల్ హెరాల్డ్ కంటే ఈడీ గురించి మాట్లాడుతా. ఈడీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్. కానీ, అదే సంస్థతో ఇప్పుడు ఆ పార్టీ ఇబ్బందులు పడుతోంది. ఆర్థిక నేరాలపై దర్యాప్తు చేసేందుకు ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంట్ వంటి అనేక సంస్థలు ఉన్నాయి. అందుకే ఈడీ అవసరం లేదు. దాన్ని రద్దు చేయాలి" అని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. భాజపా నేతృత్వంలో డబుల్ ఇంజిన్ మోడల్ ఏమేరకు విజయం సాధించిందని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. యూపీలో రెండు ఇంజిన్లు వేర్వేరు లైన్లలో వెళ్తున్నాయని విమర్శించారు. ఒడిశాలో ఏం జరుగుతోందనే విషయం తనకు తెలియదన్న ఆయన.. కేంద్రం, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉన్నప్పటికీ ఆశించిన ఫలితాలు చూపడం లేదన్నారు.

## సీఎం సిద్ధరామయ్య దంపతులకు కర్ణాటక హైకోర్టు నోటీసులు!

బెంగళూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడ్డారని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సిద్ధరామయ్యతో పాటు ఆయన సతీమణికి రాష్ట్ర హైకోర్టు నోటీసులు జారీ చేసింది. 'ముడా' కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ నోటీసులు ఇచ్చింది. ముడా కేసు దర్యాప్తును లోకాయుక్త పోలీసుల నుంచి సీబీఐకి అప్పగించాలని కోరుతూ గతంలో ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం తిరస్కరించింది.



దర్యాప్తులోని నిష్పాక్షికతను ప్రశ్నించడానికి ఎలాంటి ఆధారాలు లేవని మునుపటి తీర్పు సందర్భంగా పేర్కొంటూ పిటిషన్ కొట్టివేసింది. అయితే.. కేసును కచ్చితంగా సీబీఐకి బదిలీ చేయాలని కోరుతూ మరోసారి పిటిషన్ దాఖలైంది. దీనిపై తాజాగా విచారణ జరిపిన న్యాయస్థానం.. సీఎం సిద్ధరామయ్య, ఆయన భార్య బీఎమ్ పార్వతికి నోటీసులు పంపింది. గడు వులోగా ఈ విషయంలో తమ వాదనలు వినిపించాలని ఆదేశించింది. కాగా.. ముడా భూకేటాయింపుల్లో అవకతవలు జరిగాయంటూ గతేడాది సిద్ధరామయ్యపై పలు కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఆయన సతీమణి పార్వతి పేరిట పంపిణీ చేసిన ప్రత్యామ్నాయ స్థలాల విలువ అసలు భూముల విలువ కంటే ఎక్కువగా ఉన్నాయన్నది ప్రధాన ఆరోపణ. సిద్ధరామయ్య కుటుంబసభ్యులు లబ్ధి పొందటం, అందుకు ముఖ్యమంత్రి అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. సీఎంపై ఆరోపణలు రావడం కన్నడ రాజకీయాలను కుదిపేసింది.

## అలాంటి వార్తలు నమ్మకండి..

## సీఎన్‌జీ ఆటోలపై నిషేధం విధించబోం : ఢిల్లీ మంత్రి

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ లో సీఎన్‌జీ ఆటో రిక్షాల ను ఎలక్ట్రిక్ వాహనాలతో భర్తీ చేయనున్నారనే వార్తలపై ఢిల్లీ రవాణా శాఖ మంత్రి పంకజ్ కుమార్ సింగ్ స్పందించారు. సీఎన్‌జీతో నడిచే ఆటోరిక్షాలపై నిషేధం విధిస్తామన్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. పౌరులకు మెరుగైన రవాణా సౌకర్యాలను అందించే దిశగా ఢిల్లీ ప్రభుత్వం పనిచేస్తోందని.. సీఎన్‌జీ ఆటోలపై నిషేధం విధించబోమని మంత్రి తెలిపారు. ఇలాంటి వార్తలు పూర్తిగా సత్యదూరమని పేర్కొన్నారు. ఢిల్లీలో ఎలాంటి ఆటోరిక్షాలను తాము నిలిపివేయబోమని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం ఢిల్లీలో కొత్త ఎలక్ట్రిక్ వాహన



విధానం ముసాయిదా దశలో ఉంది. ఈ నేపథ్యంలో త్వరలో సీఎన్‌జీ ఆటోలపై బ్యాన్ విధిస్తారని పెద్ద ఎత్తున వార్తలు వచ్చాయి. దీంతో వీటిపై రవాణా శాఖ మంత్రి స్పందించాల్సి వచ్చింది. ఇవన్నీ ఊహాగానాలేనని.. అలాంటి కథనాలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. త్వరలో తీసుకురానున్న ఈవీ పాలసీపై ఢిల్లీ మంత్రివర్గం మంగళవారం సుదీర్ఘంగా చర్చించింది. కొత్త పాలసీ ఖరారయ్యేవరకూ పాత విధానాలు అమలులో ఉంటాయని అధికారులు వెల్లడించారు.

## ఆ ట్యాబ్లెట్‌ను చాక్లెట్లలా తినేస్తున్నారు.. డాక్టర్ పోస్ట్ వైరల్



'డోలో 650'.. కొవిడ్ మహమ్మారి తర్వాత నుంచి ప్రజలందరి నోళ్లలో విపరీతంగా నానుతున్న మందు ఇది. వాస్తవానికి ఇది బ్రాండ్ పేరు.. ఇందులో మందు పారాసిటమాల్. కానీ, జ్వరంగా అనగానే చాలా మంది పారాసిటమాల్‌కు బదులు.. 'డోలో 650' కావాలని అడుగుతుంటారు. అంతలా పాపులర్ అయ్యిందీ ట్యాబ్లెట్. దీని వినియోగంపై తాజాగా ఓ డాక్టర్ పెట్టిన పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పళనియప్పన్ మాణిక్కం అనే వైద్యుడు ఇటీవల తన 'ఎక్స్' ఖాతాలో ఓ పోస్ట్ చేశారు. "భారతీయులు డోలో 650ని క్యాడ్‌బరీ చాక్లెట్లలా తీసుకుంటున్నారు" అని ఆ డాక్టర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్ కాస్తా విపరీతంగా వైరల్ అవుతోంది. కేవలం రెండు రోజుల్లోనే 13లక్షల మందికి పైగా దీన్ని చూశారు. తమ ఇళ్లల్లోనూ ఇదే పరిస్థితి అని, షీట్లు షీట్లు ఇంట్లో స్టాక్ పెట్టుకుంటామని అనేక మంది కామెంట్లు చేస్తున్నారు. బెంగళూరుకు చెందిన మైక్రో ల్యాబ్స్ అనే ఫార్మా కంపెనీ 'డోలో 650'ని ఉత్పత్తి చేస్తోంది. దీంతో పాటు పలు రకాల పారాసిటమాల్ బ్రాండ్లు మన దేశీయ విపణిలో అందుబాటులో ఉన్నాయి. అయితే, వాటన్నింటి కంటే ఈ కంపెనీ మాత్రలకు ఉండే గిరాకీ చాలా ఎక్కువ. కొవిడ్ తర్వాత నుంచి దీని వినియోగం అమాంతం పెరిగింది.

## చికుబుకు రైలుకు 172 ఏళ్లు.. మూడు ఇంజిన్లతో తొలిరైలు!



దేశంలో నిత్యం కోట్లాది మంది ప్రయాణికులకు సేవలందిస్తోన్న భారతీయ రైల్వే కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టింది. 1853 ఏప్రిల్ 16న ముంబయి నుంచి థాణెకు మొదలైన ఈ రైలు దేశంలో తొలిసారి ప్యాసింజర్ రైలుగా చరిత్రలో నిలిచిపోయింది. నేటితో 172 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశంలో వీటి ప్రారంభం గురించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తొలిరైలు మూడు ఇంజిన్లతో బయలుదేరిన విషయాన్ని గుర్తుచేశారు. "172 సంవత్సరాల క్రితం, 1853 ఏప్రిల్ 16న మూడు ఇంజిన్లతో కూడిన తొలి రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి థాణెకు ప్రయాణించింది. ఆ రోజు ముంబయిలో చరిత్రాత్మకమైంది. ఆ రోజు అక్కడ ప్రభుత్వం సెలవు ప్రకటించింది. మధ్యాహ్నం 3.35గంటలకు 14కోచ్‌లతో కూడిన రైలు ముంబయిలోని బోరిబందర్ నుంచి థాణెకు ప్రయాణించింది. 21 తుపాకీలతో సెల్యూట్ చేశారు. ఆహ్వానం ఉన్న 400 మంది అందులో ప్రయాణించారు. సింధ్, సుల్తాన్, సాహెబ్ పేర్లు కలిగిన మూడు ఇంజిన్లతో రైలు ప్రారంభమైంది. 34 కి.మీ దూరాన్ని 1 గంట 15నిమిషాల్లో చేరుకుంది. అప్పటి నుంచి భారతీయ రైల్వే సేవలు అందిస్తూనే ఉంది" అని రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. తొలి రైలు వెళ్తున్న చిత్రంతోపాటు ఇటీవల దేశంలో నిర్మించిన మూడు అద్భుత రైల్వే వంతెనల ఫొటోలను ఆయన పోస్టు చేశారు.

## వాణిజ్య యుద్ధానికి భయపడేదే లేదు చైనా



ప్రతీకార సుంకాల విధింపుతో అమెరికా, చైనాలు దూకుడుగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో చైనా మరోసారి స్పందించింది. అమెరికా వాణిజ్య యుద్ధానికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ట్రంప్ యంత్రాంగంతో సంప్రదింపులకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. చర్చలకు సంబంధించి బంతి చైనా చేతిలోనే ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న నేపథ్యంలో డ్రాగన్ ఇలా స్పందించింది. "చర్చలు, సంప్రదింపుల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని అమెరికా అనుకుంటే.. తమపై చేస్తున్న ఒత్తిడిని వెంటనే ఆపాలి. బెదిరింపులు, బ్లాక్‌మెయిల్ చేయడం మానేయాలి. గౌరవం, సమానత్వం, పరస్పర ప్రయోజనాల ఆధారంగా చైనాతో చర్చలు జరపాలి" అని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ పేర్కొన్నారు.



# మడతపెడితే... గాజు!

పండగైనా, పెళ్లయినా ఎంత అందంగా రెడీ అయినా చేతులకు గాజులు లేకపోతే నిండుదనం రాదు. అందుకే కోమలమైన తమ చేతులకు గలగలలాడేలా మట్టి గాజులు వేసుకుని మురిసిపోయేవారు ఒకప్పటితరం అమ్మాయిలు... స్థాయినిబట్టి బంగారు, రాళ్ల గాజులూ ఎంచుకునేవారు. కాలం మారింది. ఆడపిల్లల అభిరుచులూ మారాయి. అలాగని ఇప్పుడూ వాటిపై మోజు ఏమీ తగ్గలేదు. కానీ, రాజసం ఉట్టిపడేలా, ఆధునికంగా, ఆడంబరంగా ఉండాలని కోరుకుంటున్నారు. అందుకే, అలనాటి మహారాణులు ఎంచుకునే డిజైన్లను ఇప్పటి యువతకోసం నయా హంగులు చేర్చి మరీ సిద్ధం చేస్తున్నారు. అలాంటివే ఈ ఫోల్డబుల్ బ్యాంగిల్స్ కూడా. చూడ్డానికి బ్రేస్‌లెట్ లుక్‌లో రూపొందించిన వీటిని హుక్ సాయంతో జత చేస్తే బ్యాంగిల్‌లా మారిపోతుంది. అలాంటివే ఇవన్నీ... బాగున్నాయి కదూ!












# లాభాల్లో ముగిసిన మార్కెట్లు..

## 309 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్న సూచీలు.. చివరి సెషన్‌లో పుంచుకోవడంతో లాభాల్లోకి వచ్చాయి. గ్లోబల్ మార్కెట్‌లో ప్రతికూల ప్రభావంతో దేశీయ మార్కెట్లు స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. బ్యాంకింగ్ స్టాక్స్ రాణించడంతో లాభాలను ఆర్జించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. ఉదయం సెన్సెక్స్ 76,996.78 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,543.77 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. ఒక దశలో 77,110.23 పాయింట్ల గరిష్ఠానికి పెరిగింది.

చివరకు 309.40 లాభంతో 77,044.29 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 108.65 పాయింట్లు పెరిగి.. 23,437.20 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,561 షేర్లు లాభపడ్డాయి. 1,244 షేర్లు నష్టపోయాయి. ఇండస్ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ట్రెంట్, ఓఎన్‌జీసీ, ఏషియన్ పెయింట్స్ లాభపడ్డాయి. మారుత సుజుకీ, హిందాల్కో, బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, టాటా మోటార్స్ నష్టపోయాయి. ఆటో, ఐటీ, ఫార్మా మినహా మిగతా అన్ని సూచీలు మీడియా, పీఎస్‌యు బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ ఒకటి నుంచి రెండుశాతం పెరిగాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగింది. స్మాల్ క్యాప్ ఇండెక్స్ దాదాపు ఒకశాతం వృద్ధిని నమోదు చేసింది.

# రూ.లక్షకు చేరువైన తులం బంగారం..

## సరికొత్త గరిష్ఠాలకు పసిడి, వెండి ధరలు..!



**న్యూఢిల్లీ:** పుత్తడి ధర బెంబేతెత్తిస్తున్నది. రోజు రోజుకు పసిడి ధర సరికొత్త గరిష్ఠాలను తాకుతున్నది. ఈ క్రమంలోనే బుధవారం మరోసారి ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరి.. తులానికి రూ.లక్షకు చేరువైంది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం రోజు రోజుకు ముదురుతున్నది. ప్రపంచవ్యాప్తంగా బంగారానికి డిమాండ్ పెరుగుతున్నది. ఈ క్రమంలో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. బుధవారం దేశ రాజధాని ఢిల్లీలో 99.9 ప్యూరిటీ బంగారం ధర ఒకే రూ.1,650 పెరిగి తులానికి రూ.98,100 చేరింది. పుత్తడి ధర రూ.96,450 వద్ద ఉండేదని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. మరో వైపు 99.5 ప్యూరిటీ గోల్డ్ ధర సైతం రూ.1,650 పెరిగి తులానికి రూ.97,650కి పెరిగి గరిష్ఠానికి చేరుకుంది. అదే సమయంలో వెండి ధర సైతం రూ.1,900 పెరగడంతో కిలో రూ.99,400కి పెరిగింది. ప్రపంచ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు రికార్డు స్థాయిలో 3,318 డాలర్లు చేరింది. ఆ తర్వాత స్వల్పంగా తగ్గి 3,299.99 డాలర్లకు పతనమైంది.

అమెరికా, చైనా మధ్య సుంకాల యుద్ధం నడుస్తున్నది. ఈ క్రమంలో బంగారం ధర పెరుగుతోందని కొటక్ సెక్యూరిటీస్లోని ఏవీపీ కమోడిటీ రీసెర్చ్ కైనత్ చైన్వాలా తెలిపాడు. బుధవారం అమెరికా చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 254 శాతానికి పెంచింది. ఈ క్రమంలో మార్కెట్‌పై మరింత ఒత్తిడి పడింది. అబాన్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చింతన్ మెహతా మాట్లాడుతూ.. అమెరికా డాలర్ ఇండెక్స్ 100 మార్కు కంటే దిగువకు పడిపోవడంతో, మూడేళ్ల కనిష్ఠానికి చేరుకోవడంతో బంగారం ధరలు రికార్డు స్థాయిలో గరిష్ఠాలను తాకుతున్నాయన్నారు. వడ్డీ రేట్లు తగ్గింపు అంచనాలు పెరగడం, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగాన్ని పెట్టుబడిదారులు నిశితంగా గమనిస్తున్నారని.. ఈ క్రమంలో బంగారం ధర పెరుగుతోందని పేర్కొన్నారు. మరో వైపు ఆసియా మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ దాదాపు 2శాతం పెరిగి 32.86 డాలర్లకు చేరుకుంది.

# భారత్‌కు శుభసూచకం

## వరుసగా మూడో సెషన్‌లోనూ బలపడ్డ రూపాయి



**ముంబై:** అమెరికన్ డాలర్‌తో పోల్చితే భారత రూపాయి వరుసగా మూడో సెషన్‌లోనూ బలపడింది. ఇవాళ (బుధవారం) 12 పైసలు మెరుగుపడి చివరికి 85.68 వద్ద ముగిసింది. విదేశీ నిధుల రాక పెరగడానికి ఇది తోడ్పడుతుంది. అలాగే అమెరికా కరెన్సీని కొంత బలహీనపర్చింది. అమెరికా వివిధ దేశాలపై టారిఫ్‌లు విధించడం ఇండియన్ రూపీకి లాభం చేకూర్చిందని ఫారెక్స్ నిపుణులు చెబుతున్నారు.

అదేవిధంగా అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గడం కూడా రూపాయి బలోపేతం కావడానికి దోహదపడింది. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్‌లో ఇవాళ 85.66 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంట్రాడేలో 85.50 గరిష్ఠ స్థాయిని తాకింది. అదేవిధంగా 85.72 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. చివరికి 85.68 వద్ద సెటిల్ అయ్యింది. క్రితం రోజు అంటే మంగళవారం నాటి ముగింపుతో పోల్చుకుంటే 12 పైసలు మెరుగుపడింది.

మంగళవారం కూడా రూపాయి బలపడింది. 30 పైసలు మెరుగుపడి 85.80 వద్ద ముగిసింది. అంతముందు సెషన్‌లో అంటే శుక్రవారం నాటి సెషన్‌లో రూపాయి ఏకంగా 58 పైసలు మెరుగుపడింది.



# సూపర్ ఓవర్‌లో రాజస్థాన్‌పై ఢిల్లీ గెలుపు

### స్టబ్స్ సూపర్ సిక్స్, స్టార్క్ సూపర్ బౌలింగ్..

### ఢిల్లీ సూపర్ విజయం.. సూపర్ ఓవర్‌లో ఓడిపోయిన రాజస్థాన్

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025లో తొలి సూపర్ ఓవర్ నమోదైంది. బుధవారం ఢిల్లీ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధ్యమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 188/5 పరుగులు చేసింది. అనంతరం రాజస్థాన్ రాయల్స్ కూడా సరిగ్గా 20 ఓవర్లలో 188/4 పరుగులు చేసింది. దీంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. అయితే రాజస్థాన్ నిర్దేశించిన 12 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ క్యాపిటల్స్.. నాలుగు బంతుల్లోనే ఛేదించింది. దీంతో ఈ టోర్నీలో ఐదో విజయాన్ని సాధించి టేబుల్ టాపర్‌గా నిలిచింది.



అయితే సూపర్ ఓవర్‌లో రాజస్థాన్ బ్యాటర్లు ఇద్దరు రనౌట్ కావడంతో ఆ జట్టు పూర్తిగా ఆరు బంతులు కూడా బ్యాటింగ్ చేయలేకపోయింది. ఈ ఓవర్‌ను స్టార్క్ వేశాడు. రాజస్థాన్ రాయల్స్ తరఫున షిమ్రాన్ హిట్‌మెయిర్, రియాన్ పరాగ్ క్రీజులోకి వచ్చారు. హిట్‌మెయర్ స్ట్రైకింగ్‌లో ఉండగా తొలి బంతి డాట్ అయింది. రెండో బంతిని అతడు బౌండరీగా మార్చాడు. మూడో బంతికి ఒక్క పరుగు వచ్చింది.

నాలుగో బంతిని రియాన్ పరాగ్ ఫోర్ కొట్టాడు. అయితే అది నోబాల్ అని ప్రకటించడంతో రాజస్థాన్‌కు ఎక్స్‌ట్రా డెలివరీ దొరికినట్లయింది. దీంతో మూడు బంతులు ముగిసే సరికే రాజస్థాన్ స్కోరు.. 10/0గా మారింది. అయితే ఆ తర్వాత లేని పరుగుకు హిట్‌మెయర్ ప్రయత్నించడంతో పరాగ్ రనౌట్ అయ్యాడు. ఐదో బంతికి రెండు పరుగులు తీసే క్రమంలో యశస్వి జైశ్వాల్ కూడా రనౌట్ అయ్యాడు. దీంతో మరో బంతి మిగిలి ఉండగానే.. రాజస్థాన్ 11/2తో సూపర్ ఓవర్‌ను ముగించింది.

అనంతరం 12 పరుగుల లక్ష్యంతో సూపర్ ఓవర్‌లో బరిలోకి దిగింది ఢిల్లీ క్యాపిటల్స్. ఆ జట్టు తరఫున కేఎల్ రాహుల్, ట్రిస్టన్ స్టబ్స్ క్రీజులోకి వచ్చారు. సందీప్ శర్మ బంతిని అందుకున్నాడు. తొలి బంతికి కేఎల్ రాహుల్ బ్యాట్ నుంచి రెండు పరుగులు వచ్చాయి. రెండో బంతి ఫోర్ రన్స్ వచ్చాయి. దీంతో సమీకరణం 4 బంతుల్లో 6 రన్స్‌గా మారింది. మూడో బంతికి రాహుల్ ఒక పరుగు తీయడంతో స్టబ్స్ స్ట్రైకింగ్ ఎండ్‌లోకి వచ్చాడు. వచ్చీ రాగానే బంతిని స్టాండ్స్‌లోకి పంపించి.. జట్టుకు విజయాన్ని అందించాడు. దీంతో మరో రెండు బంతులు మిలిగి ఉండగానే ఢిల్లీ క్యాపిటల్స్ సూపర్ ఓవర్‌లో గెలుపొందింది.

# బ్యాట్ టెస్టులో దొరికిన సునీల్ నరైన్

**ముల్లాన్‌పూర్:** కోల్‌కతా నైట్ రైడర్స్ ఆల్‌రౌండర్ సునిల్ నరైన్.. బ్యాట్ టెస్ట్‌లో దొరికిపోయాడు. పంజాబ్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో అతను బ్యాటింగ్ చేసేందుకు పిచ్‌పై వెళ్లడానికి ముందు.. బ్యాట్ టెస్ట్ చేశారు. ఆ పరీక్షలో సునిల్ నరైన్ విఫలం అయ్యాడు. ఆ ఘటనకు చెందిన వీడియో ప్రస్తుతం ఆన్‌లైన్‌లో



వైరల్ అవుతున్నది. ఐపీఎల్ ప్రారంభమైన తర్వాత గవర్నింగ్ కౌన్సిల్ ఇటీవల క్రికెటర్ల బ్యాట్లను చెక్ చేస్తోంది. సైజుకు మించి వాడుతున్న బ్యాట్లను చెకింగ్ ద్వారా పట్టేస్తున్నారు. అయితే మంగళవారం బౌండరీ లైన్ వద్ద బ్యాట్ చెకింగ్ చేస్తున్నప్పుడు సునిల్ నరైన్ బ్యాట్ ఎక్కువ వెడల్పు ఉన్నట్లు గుర్తించారు. దీంతో అతను బ్యాట్‌ను మార్చాల్సి వచ్చింది. అయితే టోర్నీలో అతను అక్రమ రీతిలో బ్యాట్‌ను వినియోగించాడా అన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి.

ముల్లాన్‌పూర్‌లో జరిగన మ్యాచ్‌లో మరో బ్యాటర్ అన్రిచ్ నోర్జా కూడా బ్యాట్ పరీక్షలో చిక్కాడు. పంజాబ్‌తో మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయడానికి వెళ్లిన సమయంలో బ్యాట్ చెక్ చేశాడు. బ్యాట్ సైజ్ పరిమితి దాటినట్లు గుర్తించారు. నరైన్ తరహాలోనే అతని బ్యాట్‌ను కూడా మార్పించారు. రిజర్వ్ అంపైర్ సయ్యిద్ ఖాలిద్ .. కేకేఆర్ బ్యాటర్ల బ్యాట్లను చెకింగ్ చేశాడు. బ్యాట్ పరీక్ష జరుగుతున్న సమయంలో కేకేఆర్ యువ బ్యాటర్ ఆంగ్రిశ్ రఘువంశీ అక్కడే ఉన్నాడు. అతని బ్యాట్‌కు చేసిన టెస్టులో అతను గట్టెక్కాడు.

బీసీసీఐ నిబంధనల ప్రకారం .. బ్యాట్ ఫేస్ వద్ద వెడల్పు 10.79 సెంటీమీటర్లు, బ్యాట్ బ్లేడ్ వద్ద మందం 6.7 సెంటీమీటర్లు ఉండాలి. ఇక బ్యాట్ ఎడ్జ్ వద్ద వెడల్పు 4 సెంటీమీటర్లు, అలాగే బ్యాట్ పొడుగు 96.4 సెంటీమీటర్లు ఉండాలి.



# తండ్రైన మరో క్రికెటర్

### మగబిడ్డకు జన్మనిచ్చిన సాగరిక ఘాట్గే

**న్యూఢిల్లీ:** టీమ్ఇండియా మాజీ క్రికెటర్ జహీర్ ఖాన్ తండ్రయ్యారు. ఆయన భార్య, బాలీవుడ్ నటి సాగరిక ఘాట్గే పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని జహీర్-సాగరిక జంట బుధవారం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. ఈ మేరకు ఫ్యామిలీ ఫొటోను షేర్ చేశారు. బాబుకు ఫతేసిన్హ్ ఖాన్ అని పేరు కూడా పెట్టారు. ఈ పోస్ట్ చూసిన అభిమానులు జహీర్-సాగరిక జంటకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

జహీర్ ఖాన్, సాగరిక ఘట్గేది ప్రేమ వివాహం. కొన్ని రోజుల డేటింగ్ అనంతరం 2017 నవంబర్‌లో వివాహం చేసుకున్నారు. అప్పటినుంచి వీరిద్దరూ ముంబయిలో ఆనందంగా జీవిస్తున్నారు. పెళ్లైన ఎనిమిదేళ్ల తర్వాత ఇప్పుడు ఈ జంట తొలి బిడ్డకు జన్మనిచ్చింది.

# 2028లో లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్

### క్రికెట్ వేదికను ప్రకటించిన ఐసీసీ

**దుబాయ్:** 2028లో లాస్ ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్ క్రీడల్లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ కాంపిటీషన్‌కు చెందిన ఓ వేదికను ప్రకటించారు. దక్షిణ కాలిఫోర్నియాలో ఉన్న పొమోనా సిటీలో క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు ఐసీసీ తెలిపింది. సుమారు 128 ఏళ్ల తర్వాత మళ్లీ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మహిళలు, పురుషుల విభాగాల్లో ఆరేసి జట్లు పోటీపడనున్నాయి. లాస్ ఏంజిల్స్‌కు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొమోనా సిటీలోని ఫెయిర్‌గ్రౌండ్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ కోసం క్రికెట్ వేదికను ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నట్లు ఐసీసీ చైర్మెన్ జే షా తెలిపారు. క్రికెట్ పాపులర్ క్రీడ అని, అయితే హద్దులు దాటి ఆ క్రీడను ఒలింపిక్స్‌లో పెట్టడం .. మెగా ఈవెంట్‌కు వన్నె తేనున్నట్లు జే షా వెల్లడించారు. టీ20 క్రికెట్ కొత్త ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందన్నారు. 1900 సంవత్సరంలో చివరిసారి పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను ఆడాడు. ఆ తర్వాత క్రికెట్‌కు బ్రేక్ పడింది. అయితే 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ 141వ సెషన్‌లో క్రికెట్ గురించి నిర్ణయం తీసుకున్నారు.




బేస్‌బాస్-సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రోసీ, స్క్వాష్ ఆటలతో పాటు క్రికెట్‌ను లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో కొత్తగా జోడించారు. క్రికెట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. 2010, 2014, 2023 ఆసియా క్రీడలతో పాటు 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో క్రికెట్‌ను టీ20 ఫార్మాట్‌లో ఆడించిన విషయం తెలిసిందే.

# డ్రగ్స్ అలవాటున్న వారితో నటించను

**మళయాల నటి విన్సీ సోనీ అలోషియస్**

టాకీస్: డ్రగ్స్ అలవాటున్న హీరోలతో ఇకముందు నటించకూడదని మళయాల నటి విన్సీ సోనీ అలోషియస్ నిర్ణయం తీసుకున్నారు. గతంలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకున్న నటి విన్సీ ఈ విషయం చెప్పారు. ఒక సినిమా సెట్స్‌లో హీరో తనతో అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిపారు. అయితే అతడి పేరును మాత్రం విన్సీ వెల్లడించలేదు. సినిమా షూటింగ్ సమయంలో ఆ హీరో డ్రగ్స్ తీసుకున్నాడు. నాతో అనుచితంగా ప్రవర్తించాడు. ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు ఎంతో ఇబ్బందిపడ్డా. తన ముందే దుస్తులు మార్చుకోమని ఇబ్బందిపెట్టాడు. అందరి ముందే ఇలాంటి మాటలు మాట్లాడేవాడు. నా జీవితంలో ఇది ఒక అసహ్యకరమైన సంఘటన. దీని తర్వాత ఇక డ్రగ్స్ అలవాటు ఉన్న నటులతో నటించకూడదని నిర్ణయించుకున్నాను. నేను తీసుకున్న ఈ నిర్ణయం వల్ల బహుశా భవిష్యత్తులో నాకు సినిమాల్లో ఎక్కువ అవకాశాలు రాకపోవచ్చు. కానీ, ఈ విషయాన్ని బహిరంగంగా చెబుతున్నాను. ఈ వ్యసనం ఉన్న వారితో నేను నటించను. నాతో అలా ప్రవర్తించిన నటుడి గురించి అందరికీ తెలుసు కానీ ఎవరూ స్పందించలేదు. డ్రగ్స్ తీసుకోవడం అతడి పూర్తి వ్యక్తిగత విషయం కావచ్చు.. కానీ, వృత్తిపరమైన వాతావరణంపై అది ప్రభావం చూపకూడదు. ఇది ఆమోదయోగ్యం కాదని విన్సీ అన్నారు. ప్రస్తుతం విన్సీ సోనీ ఆరోపణలు మలయాళ ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటికే ఈ పరిశ్రమలో ఎంతోమంది మహిళలు కాస్టింగ్ కౌచ్, లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారని జస్టిస్ హేమ కమిటీ- గతేడాది ఓ నివేదిక స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో నటి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.




## హరిహరవీరమల్లు నుంచి
# పవన్ యాక్షన్ సీన్స్




టాకీస్: పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'హరి హర వీరమల్లు' క్రిష్, జ్యోతి కృష్ణ దర్శకత్వంలో పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్‌గా సిద్ధమవుతోంది. తాజాగా ఈ సినిమాపై జ్యోతికృష్ణ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ఇందులో ఒక యాక్షన్ సీక్వెన్స్‌ను రూపొందించే బాధ్యత పవన్ కల్యాణ్ తీసుకున్నారు. ఈ సినిమాలో మొత్తం ఆరు యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయి. 20 నిమిషాలపాటు- ఉండే ఒక దాన్ని పవన్ రూపొందించారు. ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఈ సీక్వెన్స్‌లో 1100 మంది పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో 61 రోజులు దీన్ని చిత్రీకరించాం. దీని కోసం ఆయన ఎంతో కష్టపడ్డారు. గ్రౌండ్ వర్క్ చేశారు. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్లతో చర్చించారు. సినిమా మొత్తంలో ఇదే హైలైట్ కానుందని తెలిపారు. ఇక ఈ సినిమా కోసం ఆయన ప్రత్యేకంగా గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకున్నట్లు జ్యోతికృష్ణ తెలిపారు. ఇందులో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ నటిస్తోన్న విషయం తెలిసిందే. ఆమె కూడా ఇటీ-వల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ సినిమాలోని ప్రతి అంశంలో పవన్ భాగమయ్యారని తెలిపారు. రెండు పార్ట్‌లుగా తెరకెక్కుతున్న ఈ చిత్రం తొలి భాగం 'హరి హర వీరమల్లు పార్ట్-1 స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో మే9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# చిత్రసీమలో ఏఐ వినియోగం

**త్వరలోనే కంపెనీ ప్రారంభించనున్న దిల్‌రాజు**

టాకీస్: టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన దిల్ రాజు సినీ రంగంలో మరో వినూత్న ప్రయాణాన్ని ప్రారంభించ బోతున్నాడు. క్వాంటం ఏఐ గ్లోబల్‌తో కలిసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత మీడియా కంపెనీని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఈ కొత్త వెంచర్ ద్వారా సినీ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చే లక్ష్యంతో మే 4న కంపెనీ పేరు సహా పూర్తి వివరాలను వెల్లడించనున్నారు. ఈ ప్రకటనను దిల్ రాజు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధికారికంగా విడుదల చేసింది, ఈ సందర్భంగా ఓ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ కొత్త కంపెనీ వినోద రంగానికి ప్రత్యేకంగా రూపొందించిన అధునాతన ఏఐ సాధనాలను అభివృద్ధి చేసి అందించనుంది. దిల్ రాజు ఈ సహకారం గురించి మాట్లాడుతూ, సినిమా నిర్మాణంలో ఏఐ సాంకేతికత ద్వారా కొత్త అవకాశాలను సృష్టించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రకటన సినీ అభిమానులు, ఇండస్ట్రీ నిపుణులలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.




# బంధం బలంగా ఉండాలంటే.. ఒంటరితనం రావద్దు

**రష్మిక హాట్ కామెంట్స్**

టాకీస్: ప్రజంట్ బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ లో బాగా వినిపిస్తున్న పేరు రష్మిక మందన. సక్సెస్‌లతో దూసుకపోతున్న ఈ ముద్దుగుమ్మ క్షణం తీరిక లేకుంగా వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంది. బాలీవుడ్‌లో క్రేజీ స్టార్‌గా మారిపోయిన రష్మిక.. ఆయుష్మాన్ ఖురానా తో 'థామా' అనే చిత్రంలో బిజీగా ఉంది. ఇది హారర్ మూవీ కావడంతో గత కొన్ని రోజుల నుంచి నైట్ షూట్ అంటూ తిరుగుతోంది. ఇక మూవీస్ విషయం కాస్త పక్కన పెడితే. రౌడి హీరో విజయ్, రష్మిక ఇద్దరు డేటింగ్‌లో ఉన్నారన్నే వార్తలు ఎప్పటి నుంచో వింటున్నాం. చాలా సార్లు వీరిద్దరు మేము జస్ట్ ఫ్రెండ్ అని చెప్పిన.. ఏ వెకేషన్‌లకు వెళ్లినా ఇద్దరు కలిసే వెళతారు. ఇద్దరూ ఒకే చోట ఉంటారు.. కానీ వేర్వేరు ఫొటోలను షేర్ చేస్తుంటారు. అయితే తాజాగా రష్మిక రిలేషన్ షిప్ గురించి ఓ పోస్ట్ పెట్టింది.. రష్మిక కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు ఆమెకు సంబంధించిన ప్రతి ఒక అప్ డేట్ అభిమానులతో పంచుకుంటూ ఉంటుంది. ఇందులో భాగంగా తాజాగా 'రిలేషన్ స్ట్రాంగ్‌గా ఉండాలంటే పాటించాల్సిన రూల్ ఏంటో తెలుసా? ఎప్పుడూ ఏ క్షణం అయినా సరే ఒంటరిగా బాధపడే రోజు రాకుండా చూసుకోవాలి.. కష్టసుఖాల్లో ఇద్దరూ ఒకరికి ఒకరు తోడుగా ఉంటూ.. ఎట్టి పరిస్థితుల్లోనూ చేయి విడవద్దు అనే రూల్ పెట్టుకుంటే చాలు' అని ఎక్కడో వచ్చిన ఓ పోస్ట్‌ను, తన ఇన్ స్టా స్టోరీలో షేర్ చేసింది. అంతే కాదు 'ఈ రూల్‌ని నేను కూడా నేను కూడా అంగీకరిస్తున్నా.. ఒప్పకుంటున్నా' అని రష్మిక రాసుకొచ్చింది.

# ఏడాది చివరలో స్పిరిట్ సెట్స్‌లోకి ప్రభాస్

**టాకీస్:** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ 'స్పిరిట్' భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా.. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. జరిగిన ఓ కార్యక్రమంలో దర్శకుడు సందీప్ రెడ్డి వంగా మాట్లాడుతూ.. స్పిరిట్ సినిమా షూటింగ్‌ను మెక్సికోలో జరుపబోతున్నట్లు ప్రకటించాడు. ఇంతకంటే ఏం అప్‌డేట్ ఇవ్వలేమని తెలిపాడు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన ఏ వార్త అయినా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా దీనికి సంబంధించిన కొన్ని వార్తలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి.




తాజాగా ఈ మూవీకి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఏడాది చివరిలో 'స్పిరిట్' సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించి మరో అప్‌డేట్ వచ్చింది. ప్రభాస్ ప్రస్తుతం ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాతే సందీప్ రెడ్డి స్పిరిట్‌లో జాయిన్ కాబోతున్నట్లు తెలుస్తుంది. స్పిరిట్ షూటింగ్ మొత్తం 120 రోజులకు పైగా జరగనుందని, అందులో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని సమాచారం. ఈ సినిమా కోసం ప్రభాస్ జిమ్‌లో తీవ్రంగా వర్కవుట్ చేస్తూ కొత్త లుక్‌ను సిద్ధం చేస్తున్నారట. ఇప్పటివరకూ చూడని ప్రత్యేకమైన లుక్‌లో ఆయన ఈ చిత్రంలో కనిపించనున్నట్లు- తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా అమెరికాలో ఈ షెడ్యూల్‌లో 90 రోజులకు పైగా ప్రభాస్ పాల్గొననున్నారని టాక్. తన లుక్ కోసం జిమ్‌లో వర్కవుట్ చేయనున్నారట. ఇందులో ప్రభాస్ ఇప్పటివరకూ చూడని లుక్‌లో కనిపించనున్నట్లు- సమాచారం. తాజాగా యూఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సందీప్ వంగా మాట్లాడుతూ దీని షూటింగ్ అప్‌డేట్ పంచుకున్నారు. చిత్రీకరణ కోసం మెక్సికోలోని కొన్ని ప్రాంతాలు పరిశీలిస్తున్నట్లు- తెలిపారు. సందీప్ వంగాకు సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది. ఈ డైరెక్టర్ రామ్‌చరణ్‌తో ఓ సినిమా చేయనున్నట్లు- తెలుస్తోంది. రామ్ చరణ్ 'పెద్ది' పూర్తయిన తర్వాత ఈ సినిమా ప్రారంభించ నున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన కోసం చరణ్ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.